# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 10, ఆగస్టు 2026


# ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఆదర్శనీయం

★ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 9, ప్రభాతవార్త

ఆదివాసీలు పాటిస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు సమాజంలో ఆదర్శనీయమని, వాటిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవన్ లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు ఎస్.పి. నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలమణి, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల శాసనసభ్యులు కోవ లక్ష్మీ, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి.అహ్మద్, ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జండా వద్ద ఆదివాసీల సాంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి 9 తెగల అమరుల చిత్రపటాలకు పూజలు నిర్వహించి కుమ్రంభీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, త్రాగునీరు, రవాణా సదుపాయం, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు మిగతా 2లో..





# జోడేఘాట్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



❁ ఆదివాసీ చట్టాలను, హక్కులను పకడ్బందీగా అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

❁ ముఖ్య అతిథిగా హాజరైన తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నక విజయ్‌కుమార్, కొమురం భీం మనవడు కుంరం సోనేరావు

కెరమెరి, ఆగస్టు 9, ప్రభాతవార్త

జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరుడు కొమురం భీం పోరాట గడ్డ జోడేఘాట్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొమురం భీం మనవడు కుంరం సోనేరావు, తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నక విజయ్ కుమార్, తుడుందెబ్బ జిల్లా నాయకత్వం ఆదివాసీ టైగర్ సేనా ప్రతినిధులు హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా ముందుగా కొమురం భీం సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీల విశిష్ట సంప్రదాయాలను గుర్తించి ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9ని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా కేటాయించడం శుభపరిణామమని, కొమురం భీం పోరాడిన నేలపై ఈ వేడుకలు జరుపుకోవడం గర్వకారణమని తుడం దెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నక విజయ్ కుమార్ అన్నారు. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా నేటికీ ఆదివాసీ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆదివాసీలపై దాడులు అటవీ అధికారుల తీరు..**

అడవినే దేవతగా పూజిస్తూ, సంరక్షిస్తున్న ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల మిగతా 2లో..

# ఆదిలాబాద్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

❁ ఆదివాసీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి

❁ ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్



ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ఆగస్టు 9, ప్రభాతవార్త

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ మండల కేంద్రంలోని పీఎంఆర్సీలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**కొమురం భీమ్‌కు ఘన నివాళి**

కార్యక్రమానికి ముందు కేబీ కాంప్లెక్స్ ఆవరణలో కొమురం భీం విగ్రహాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివాసీలతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు సంప్రదాయ నృత్యాల్లో పాల్గొన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

**గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

**- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ కొమురం భీమ్, రాంజీ గోండ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తికి అనుగుణంగా ఆదివాసుల హక్కుల పరిరక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీవీటీజీ నివాస ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తూ ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద వేలాది ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని పలు గ్రామాలను పైలట్ మిగతా 6లో..







## నూతనంగా ఎన్నికైన ఎస్సీ సెల్ నాయకులకు సన్మానం

**భైంసా, ఆగస్టు 09, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కుబీర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాడ్వాలే దమ్మపాల్‌ను కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణరావు పాటిల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు భైంసా టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన శరత్ డోంగ్రే, అనిల్ బాసర్‌లను కూడా సన్మానించారు. కార్యకర్తలను గుర్తించి పదవులు ఇప్పించినందుకు బోస్లే నారాయణరావు పాటిల్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముధోల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, కుబీర్ మండల అధ్యక్షుడు బసిరుద్దీన్, నిర్మల్ జిల్లా జనరల్ సెక్రటరీ పురంశెట్టి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బంక బాబు, జిల్లా సెక్రటరీ జీడి రామ్, తానూర్ మండల మాజీ ఎంపీపీ బి. చంద్రకాంత్, ముధోల్ తాలూకా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షఫీ, సుదర్శన్ రెడ్డి, ఏ. దేవదాస్, కుబీర్ మండల ఆత్మ డైరెక్టర్ రాథోడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి

**భైంసా, ఆగస్టు 09, ప్రభాతవార్త:**

తానూర్ మండలంలోని ధాగావ్ గ్రామానికి చెందిన అంకంవార్ భూమేందర్ తల్లి అంకంవార్ సరస్వతి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి ఆదివారం ధాగావ్ గ్రామానికి వెళ్లి భూమేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సరస్వతి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. వారికి ధైర్యం చెప్పి, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వెంట మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సాగర్ బాయి రాజన్న, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ పోత రెడ్డి, గ్రామ పంచాయతీ సర్పంచ్ గాడేకర్ సాయినాథ్, మాజీ సర్పంచ్ అంకంవార్ సాయినాథ్, ఆసం మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను సన్మానించిన గంగపుత్రులు

**భైంసా, ఆగస్టు 09, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఆదివారం శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామంలో ఉన్న గంగామాత ఆలయానికి ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సరఫరా లేకపోవడం, పలు సమస్యలు ఎదురవుతుండటంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆ సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, నాయకులు గంగారెడ్డి, పృథ్వీ పటేల్, వెంగల్‌రావు, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# జోడేఘాట్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

దాడులు, వేధింపులు ఆగడం లేదని మండిపడ్డారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను టైగర్ జోన్, టైగర్ కారిడార్ పేరిట లాక్కొని గిరిజనులను అడవికి దూరం చేస్తున్నారని విమర్శించారు. చట్టాల నిర్వీర్యం ఆదివాసీ పరిరక్షణ చట్టాలైన 1/70 చట్టం, పెసా చట్టాలను అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని, ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర ధనికులకు వత్తాసు పలుకుతూ అక్రమ నిర్మాణాలకు బాటలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. భవిష్యత్ కార్యాచరణ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసీల చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోతే రానున్న రోజుల్లో పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



### కన్నుల పండువగా సాంస్కృతిక ప్రదర్శనలు..

సమావేశం అనంతరం ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు, వాయిద్యాల మోతలతో జోడేఘాట్ ప్రాంగణం మార్మోగింది. ఆదివాసీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కలిసి సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ టైగర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోట్నక కిషన్, ప్రధాన కార్యదర్శి పెందోర్ దర్ము, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతి, జిల్లా ముఖ్య సలహాదారు కనక ప్రభాకర్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకి తుకారాం, పోరు గ్రామాల యువజన సంఘం వ్యవస్థాపకులు పెందోర్ రాజేశ్వర్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ ఇందిరా, ఆదివాసీ టైగర్ సేనా జిల్లా ప్రధాన కార్యదర్శి మడవీ పురుషోత్తం, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు మడవచి భీంరావు, వెంకటేష్, జిల్లా కార్యదర్శి సిడం నాగేష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఈశ్వర్, నాయకులు అడ సోమేష్, పోరు గ్రామాల పటేళ్లు, దేవారీలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఆదర్శనీయం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివాసీలు ఈ ప్రపంచంలో అతి పురాతనమైన జాతి అని, వారి సంస్కృుతి, సంప్రదాయాలు, ఆచారాలు ప్రత్యేకమైనవని, వాటిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని తెలిపారు. కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి ఇక్కడికి గిరిజన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ఈ ప్రాంత పర్యాటక రంగం అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గిరిజనులు విద్య, ఉపాధి రంగాలలో రాణించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే సమయంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్నామని, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్.పి. మాట్లాడుతూ ప్రపంచంలో అధివాసీల సంస్కృుతి, జీవనశైలి, ఆచారాలు అలవాట్లు విభిన్నమైనవని, అన్ని జాతుల వారికి ఆదర్శనీయమని తెలిపారు. పోలీసులు ఎప్పుడు ఆదివాసీల సంక్షేమం కోసం పనిచేస్తారని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును బంగారు మయంగా మలచుకోవాలని తెలిపారు. శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంద్రవెల్లి స్మారక స్థూపం అభివృద్ధికి 1 కోటి రూపాయలు మంజూరు చేసి అమరులైన కుటుంబాల వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఆదివాసీలు తమ సంస్కృుతి, సాంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఆదివాసీ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించి విద్య, వైద్యం, ఇంటర్నెట్ సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోడు సమస్యను త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను బలోపేతం చేసి ఆదివాసి గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులు, పి.వి.టి.జి.ల అభివృద్ధికి ప్రధానమంత్రి జన్‌మన్, జుగా పథకాల ద్వారా నివాస గృహాలు, విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటుందని, ఆదివాసీలు తమ సంస్కృుతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్.పి. గిరిజనుల వేషధారణ ధరించడం అందరిని ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్, ఎస్.పి., జిల్లా అటవీ అధికారి, ఆసిఫాబాద్ శాసనసభ్యులు గిరిజన మహిళలతో కలిసి దింసా నృత్యం చేసి ఆదివాసీలలో ఉత్సాహాన్ని నింపారు. గిరిజన సంఘాల ప్రతినిధులు పలు సమస్యల పరిష్కారం కొరకు వినతి పత్రం అందజేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలలో భాగంగా కుమ్రంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా ఆదివాసి భవన్ కు చేరుకున్నారు. గిరిజన విద్యార్థులు, గుస్సాడి బృందాలు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, డి.సి.సి. ప్రతినిధి ఆత్రం సుగుణ, మాజీ శాసనసభ్యులు ఆత్రం సక్కు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీబీన్ అహ్మద్, నాయకులు అరిగెల నాగేశ్వర రావు, గిరిజన సంఘాల ప్రతినిధులు సిడాం అర్జు, మర్సుకోల సరస్వతి, పెందూర్ గోపి, గుణవంతు రావు, కుర్సింగ మోతిరామ్, ఆత్రం భీమ్ రావు, ముట ఎల్లయ్య, పెందూరు సుధాకర్, కుడ్మెత మారుతి, 9 తెగల నాయకులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆదిపరాశక్తి అమ్మవారి బోనాల జాతర

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ - ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష**

**నస్పూర్, ఆగస్టు 9, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌లో శ్రీ ఆదిపరాశక్తి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తి, సంప్రదాయం, సంస్కృుతికి ప్రతీకగా నిలిచే ఈ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ ఆదిపరాశక్తి అమ్మవారి దివ్య ఆశీస్సులు మంచిర్యాల నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖశాంతులతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సంస్కృుతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్ పాల్గొన్నారు. వీరితో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నస్పూర్ పట్టణ ఇంఛార్జి నూకల రమేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు భారీగా హాజరయ్యారు.








## బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్ఐగా డి. రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

**బెల్లంపల్లి, ఆగస్టు 09, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా డి. రామకృష్ణారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నెన్నెల పోలీస్ స్టేషన్ నుండి బదిలీ అయిన ఆయన, వన్‌టౌన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టి, వన్‌టౌన్ సిఐ కె. శ్రీనివాసరావును పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వచ్చే ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి. రామకృష్ణారావు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా, క్రమశిక్షణతో నిర్వర్తిస్తానని తెలిపారు. ప్రజలకు నిష్పక్షపాతంగా పోలీసు సేవలు అందించడంతో పాటు, పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.



## నూతన కమిటీ ఎన్నిక

**వేమనపల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త**

మండల సకల కళాకారుల సంరక్షణ జేఏసీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి వెంకటాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా రత్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొమురెల్లి మొండి, ప్రధాన కార్యదర్శిగా దూల చంద్రయ్య, కోశాధికారిగా కొండ బాపు, సలహాదారుగా ఏలేశ్వరం దేవేంద్రచారి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా మూల వెంకాగౌడ్, సహాయ కార్యదర్శులుగా రెబ్బెన పురుషోత్తం, వాల్మీకి మహేష్, పుప్పాల గణేష్, దన్నూరి ఏమాజీ, కొండగొర్ల ధర్మయ్య, పగాడి శ్రీనివాస్, జాడి ధర్మయ్య, గోర్క రాజన్నలను ఎన్నుకున్నారు. మండలంలోని కళాకారుల సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమానికి నూతన కమిటీ కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

## మోతుగూడలో బోనాల పండుగ సందడి

**ఆసిఫాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త**

మండలంలోని మోతుగూడ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.



# ఆదివాసీల హక్కుల పరిరక్షణే అభివృద్ధికి పునాది

**- పీసా, ఎఫ్ఆర్ఏ చట్టాలను పకడ్బందిగా అమలు చేయాలి - ప్రకృతి పరిరక్షణతోనే భవిష్యత్తు తరాలకు భరోసా**

**- జై జంగుబాయి ఆదివాసీ మహిళ సంఘం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు మర్సుకోల కమల**

**- గిన్నెధరిలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం**

**తిర్యాని, ఆగస్టు9, ప్రభాతవార్త**

ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, భాష, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని జై జంగుబాయి ఆదివాసీ మహిళ సంఘం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు మర్సుకోల కమల పేర్కొన్నారు. తిర్యాని మండలంలోని గిన్నెధరిలో ఆదివారం జై జంగుబాయి ఆదివాసీ మహిళ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆదివాసీ సంఘాల నాయకులు కుమ్రం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఆదివాసీ వీరుల త్యాగాలను, పూర్వీకుల ఆత్మగౌరవ పోరాటాలను స్మరించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మర్సుకోల కమల మాట్లాడుతూ ఆదివాసీ సమాజం ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అని పేర్కొన్నారు. అడవి తల్లి, నీరు, భూమి, భవిష్యత్ అనే భావనతో తరతరాలుగా ప్రకృతిని సంరక్షిస్తూ జీవిస్తున్న గొప్ప సంస్కృతి ఆదివాసీలదన్నారు. జల్, జంగల్, జమీన్ ఆదివాసీల జీవన హక్కులకు మూలాధారమని స్పష్టం చేశారు. అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా చరిత్రలో అనేక మంది ఆదివాసీ వీరులు చేసిన పోరాటాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ధైర్యం, త్యాగం, ఆత్మగౌరవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఆదివాసీ పిల్లలకు తమ చరిత్ర, భాష, గోండి సహా స్థానిక ఆదివాసీ భాషలు, సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడం తల్లిదండ్రులు, సమాజం బాధ్యతగా పేర్కొన్నారు. నేటికీ అనేక ఆదివాసీ ప్రాంతాలు రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి, భూమి హక్కులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో అడవులు, సహజ వనరులు ధ్వంసం కాకుండా, ఆదివాసీల జీవన హక్కులు, సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పీసా చట్టం-1996 షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభకు స్వయంపాలన, స్థానిక నిర్ణయాధికారాలను బలోపేతం చేస్తుందని వివరించారు. గ్రామసభ నిర్ణయాధికారాన్ని గౌరవించి, స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ)-2006 అటవీ ప్రాంతాల్లో నివసించే అర్హులైన ప్రజలకు అటవీ భూమి, అటవీ వనరులు, జీవనాధారంపై హక్కులను గుర్తిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి అటవీ హక్కులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసా మన గ్రామానికి స్వయంపాలన హక్కును ఇస్తుందని. ఎఫ్ఆర్ఏ మన అడవి, భూమి, జీవనాధారంపై చట్టబద్ధమైన హక్కును కల్పిస్తుందన్నారు. ఈ రెండు చట్టాలు ఆదివాసీల అస్తిత్వం, సంస్కృతి, గౌరవం, భవిష్యత్తును రక్షించే కీలకమైన చట్టాలన్నారు. ప్రతి అర్హత కుటుంబానికి అటవీ హక్కులు అందాలని ఆమె కోరారు. ఆదివాసీ యువత విద్య, ఉద్యోగాలు, సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆధునికతను స్వీకరిస్తూనే తమ మూలాలను, భాషను, సంస్కృతిని, సంప్రదాయాలను మరువకూడదన్నారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ఐక్యంగా పనిచేసి హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. మన సంస్కృతిని కాపాడుదాం.. మన భాషను అభివృద్ధి చేద్దాం.. మన హక్కులను సాధిద్దాం.. గ్రామసభలను బలోపేతం చేద్దాం.. అర్హులందరికీ అటవీ హక్కులు అందేలా కృషి చేద్దాం.. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంచందర్, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి శివప్రసాద్, మడావి గుణవంత్ రావు, రాధ, రేణుక, ఆడ తాను, శోభన్, సర్‌మేడిలు, మండలంలోని గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మర్సుకోల కమల

# బాసరలో కనుల పండువగా ఊర పండుగ

**- అమ్మవార్లకు ఆషాడ మాస బోనాలు సమర్పణ**

**భైంసా, ఆగస్టు 09, ప్రభాతవార్త:**

బాసర మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఊర పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలు శ్రీ మహాలక్ష్మి, మహాకాళి, పోచమ్మ, మైసమ్మ, మారెమ్మ అమ్మవార్లకు ఆషాడ మాస బోనాలు, పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని ప్రజలంతా ఐక్యంగా పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పండాలని కోరుకున్నారు. గతంలో 2020లో ఊర పండుగ నిర్వహించామని, మళ్లీ ఐదేళ్ల తర్వాత ఈ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్ అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఆదివాసీల హక్కులు, సంస్కృతి పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది

**- మాజీ జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి**

**లక్షెట్టిపేట, ఆగస్టు 9, ప్రభాతవార్త**

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధి కరీంనగర్ చౌరస్తాలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివాసీ వీరుడు కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదివాసీలు ఈ దేశానికి, ప్రకృతికి నిజమైన సంరక్షకులని అన్నారు. అడవులు, జల వనరులు, ప్రకృతి సంపదను కాపాడుతూ తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కూడా ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమైందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేక మంది ఆదివాసీ వీరులు ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. కొమురం భీం వంటి మహనీయుల పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంతో ఘనమైనవని అన్నారు. వారి ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృుృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఆదివాసీల హక్కులను పరిరక్షించడంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ల అభివృద్ధే బిజెపి ధ్యేయం

- మేకల దాసు - షిర్కే సెంటర్‌లో ప్రజా పోరు యాత్ర ప్రారంభం - సెప్టెంబర్ 1న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపు

**నస్పూర్, ఆగస్టు 9, ప్రభాతవార్త**



సీపీఐ ప్రజా పోరు యాత్రను ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారుల అభివృద్ధినే దేశ అభివృద్ధిగా చూపిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు విమర్శించారు. నిరసిస్తూ సీపీఐ చేపట్టిన ప్రజా పోరు యాత్ర మూడో రోజు కార్యక్రమాన్ని ఆదివారం నస్పూర్ పట్టణంలోని షిర్కే సెంటర్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ఈ విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు ఎందుకు పెంచడం లేదో బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని మేకల దాసు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ధరలను నియంత్రించడంలో, పేద విద్యార్థులకు విద్యను అందించడంలో, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో వైఫల్యం చెంది అబద్ధపు ప్రచారాలతో కాలాన్ని వెళ్లదీస్తోందని ఆరోపించారు. దేశంలో పేద ప్రజల సామాజిక, నైతిక అభివృద్ధే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. విద్య, వైద్యం ప్రతి పేదవాడికి అందుబాటులోకి రావాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచడం ద్వారా మాత్రమే ఉపాధి భద్రత, దేశాభివృద్ధి సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, కారుకూరి నగేష్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు, ఎస్‌కే బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, మోత్కూరు కొమురయ్య, గునిగంటి నర్సింగరావు, సురేష్, చిలుక రామచందర్ పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

**లక్షెట్టిపేట, ఆగస్టు 09, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు స్థానిక ఐబి ఆవరణలో 66 వ జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల, పట్టణ యువజన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంలో యూత్ కాంగ్రెస్ పాత్ర చాలా గొప్పదని, రాబోయే రోజుల్లో మరో సారి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గెలుపుతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో యూత్ కాంగ్రెస్ బలంగా పనిచేస్తుంది అని తెలియజేయడం జరిగింది. యూత్ కాంగ్రెస్‌కు ఎల్లప్పుడూ అండగా ఉండే ఎమ్మెల్యేకు ధన్యవాదాలు చెప్పి ఆనందం వ్యక్తం చేయడం జరిగింది.

## మణుగూరు గని కేటాయింపుపై కిషన్‌రెడ్డికి బిఎమ్ఎస్ ధన్యవాదాలు

- కోయగూడెం, జెవిఆర్ బ్లాకులను సింగరేణికి కేటాయించాలని వినతి

**నస్పూర్, ఆగస్టు 9, ప్రభాతవార్త**

మణుగూరు పీకే ఓసీ–2 డిప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టును సింగరేణికి కేటాయించడంలో చొరవ చూపిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబికేఎంఎస్-బిఎమ్ఎస్) ధన్యవాదాలు తెలిపింది. ఇదే తరహాలో సుదీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని కోయగూడెం ఓసీ–3, జెవిఆర్ ఓసీ–3 బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసింది. దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చారని సంఘ ప్రతినిధులు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుకుని, ప్రైవేట్ సంస్థలకు కేటాయించడం వల్ల నూతన గనులు అందుబాటులోకి రాలేదని బిఎమ్ఎస్ నేతలు విమర్శించారు. ఫలితంగా గనుల మూసివేతతో ఈ ఏడాది సుమారు 12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైవేట్ సంస్థలు పొందిన కోయగూడెం, జెవిఆర్ బ్లాకుల్లో భూసేకరణ, చట్టపరమైన వివాదాలు, అనుమతుల్లో జాప్యం వల్ల ఇప్పటివరకు ఉత్పత్తి ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుత కేటాయింపులపై సమీక్ష జరిపి డీలొకేషన్ ద్వారా సింగరేణికి పునఃకేటాయించాలని కోరారు. బొగ్గు ఉత్పత్తికి పుట్టినిల్లయిన ఇల్లందు ప్రాంత భవిష్యత్తుకు కోయగూడెం ఓసీ–3 ప్రాజెక్టు అత్యంత కీలకమని ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్ తెలిపారు. ఈ బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే మౌలిక సదుపాయాలు, భౌగోళిక పరిజ్ఞానం ఉపయోగపడి ఉత్పత్తి పెరగడమే కాకుండా, కార్మికులకు ఉద్యోగ భద్రత, స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు పులి రాజా రెడ్డి, ఏబికేఎంఎస్ అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, జనరల్ సెక్రటరీ వడ్డేపల్లి కుమారస్వామి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.వి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో గంగాదేవి అమ్మవారికి బోనాల సమర్పణ

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**మంచిర్యాల, ఆగస్టు 9, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలో గంగపుత్రుల ఆధ్వర్యంలో గంగాదేవి బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు హాజరై గంగాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 14వ డివిజన్ కార్పొరేటర్ తూముల నరేష్, 46వ డివిజన్ కార్పొరేటర్ పెంట రజిత పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలతో తరలివచ్చి గంగాదేవి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారాయి. కార్యక్రమంలో బోరి యాదగిరి, కునారపు చెందు, శాఖపురం చలం, తోకల అవినాష్, గుమ్ముల సుదర్శన్, శ్రీనివాస్, శాకాపురం శంకరయ్య, బాలరాజు, చెట్టిపెల్లి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గంగాదేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బోనాల వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.





## బెల్లంపల్లి రడగంబాల బస్తీలో ఘనంగా బోనాల వేడుకలు

**బెల్లంపల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీలో ఆషాఢ మాసం బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు స్థానిక వార్డ్ కౌన్సిలర్ దామెర విజయ-శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ వేడుకలకు బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమెతో పాటు ఇతర కౌన్సిల్ సభ్యులు కూడా పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి స్వయంగా బోనం ఎత్తుకొని ఆలయానికి చేరుకున్న చైర్‌పర్సన్ అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గంలోని రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని చైర్‌పర్సన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు, బస్తీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 9, ప్రభాతవార్త**



మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు ఆటో కార్మికుల సమస్యలపై ఆటో ఐకాస నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం ఆటో ఐకాస మంచిర్యాల కమిటీ ఆధ్వర్యంలో 17 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఆటో డ్రైవర్లకు ప్రాధాన్యత ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధికారులకు సూచనలు చేసి త్వరగా పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూల స్పందనపై ఆటో ఐకాస సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమానికి సమన్వయం చేసిన ఐకాస అధ్యక్షుడు తూముల నరేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో ఐకాస నాయకులు పొట్ట మధుకర్, చెల్ల విక్రమ్, సుద్దాల రాజకుమార్, కట్టా రామ్ కుమార్, తగరం శ్రీనివాస్, ఎండి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధారి వనంలో జనజాతర..



* డప్పుల దరువులకు పూనకాలతో ఊగిపోయిన శివసత్తులు
* డిజే మోతలకు చిందులేసిన యువకులు
* మైసమ్మకు బోనాలు సమర్పించిన క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు
* క్యూ లైన్ లలో స్వల్ప ఒత్తిడి సొమ్మసిల్లిన చిన్నారులు, మహిళలు
* అడుగడున పోలీస్ నిఘా, సిసి కెమెరా, డ్రోన్‌లతో పర్యవేక్షణ



**క్యాతన్‌పల్లి, ఆగస్టు 09, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర పండుగ అయినా బోనాల జాతర ఆషాడ మాసం చివరి ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగింది. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ బొక్కల గుట్ట, రాళ్ళవాగు నది (పాలవాగు పెద్దవాగు సంగమం) ఒడ్డు జాతీయ రహదారి ప్రక్కన వెలసి భక్తుల కొంగు బంగారమై విలసిల్లుతున్న గాంధారి మైసమ్మ బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. బొక్కల గుట్ట గ్రామ శివారు అటవీ ప్రాంతం, కోటేశ్వర్ రావు పల్లె అటవీ ప్రాంతాలతో పాటు, గాంధారి వనం, చిల్డ్రన్స్ పార్క్‌లలో ఎటు చూసినా జన జాతారే, జిల్లా నలుమూలల నుండి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రాల నుంచి వేలాది భక్తులు తరలి వచ్చి గాంధారి మైసమ్మ దర్శనం చేసుకున్నారు. తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభం అయ్యి, రాత్రి 8 గంటల వరకు భక్తులు మొక్కులు చెల్లించారు. మహిళలు నెత్తి మీద బోనంతో కుటుంబ సమేతంగా గంటల తరబడి క్యూ లైన్‌లలో వేచి ఉండి మైసమ్మ దర్శనంతో భక్తి పారవశ్యంలో తేలిపోయారు.

### డప్పుల దరువులకు శివసత్తులు.. డిజే మోతలకు యువకులు...

బొక్కలగుట్ట గ్రామ శివారులోని వాగు ఒడ్డున ఏర్పాటు చేసిన సుమారు 250 బోనాలను పోలీస్ స్పెషల్ పార్టీ రోప్ పార్టీ మధ్యన జన సందోహం నడుమ మైసమ్మ ఆలయం వరకు సాగే బోనాల ఊరేగింపు జాతరలో ప్రధాన ఘట్టం. ఈ ఊరేగింపులో డప్పు చప్పుళ్ల దరువులకు శివసత్తులు ఊగిపోతుండగా, డిజే సప్పుడు మోతలకు యువకులు నృత్యాలు వేస్తూ కదిలారు.

### బోనం ఎత్తిన మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు.. పార్టీల నాయకులు...

మైసమ్మ బోనాల జాతరలో ప్రధాన ఘట్టంగా పేర్కొంటారు. క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ గోడిశేల సంధ్యా రాణి, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు డాక్టర్ రాజా రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య, భీమా శరత్‌లు బోనాలు ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొని ఆలయానికి చేరుకుని మైసమ్మ దర్శనం చేసుకుని బోనాలు సమర్పించారు.

### క్యూ లైన్ లలో స్వల్ప ఒత్తిడి, సొమ్మసిల్లిన చిన్నారులు, మహిళలు...

అమ్మవారి ఉచిత దర్శనం, స్పెషల్ దర్శనం, వీఐపీ దర్శనం కోసం రెండు క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్ లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తుల తాకిడి ఎక్కువ ఉంది. క్యూ లైన్‌ల మధ్యలో పోలీసులను గాని, వాలింటర్‌లను ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో స్వల్ప ఒత్తిడి, తోపులాట జరిగి, పదుల సంఖ్యలో చిన్నారులు, మహిళలు సొమ్మసిల్లి పోయారు, కుటుంబ సభ్యులు వెంటనే క్యూ లైన్‌ల మీదుగా వైద్య శిబిరానికి తరలించగా, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్స అందించారు. నిర్వాహకులు చేసిన నిరక్ష్యాన్లికి భక్తులు కొంత గట్టిగానే తమ అసహనాన్ని తెలియజేస్తూ, ఆదాయ రాబడి పై ఉన్న శ్రద్ధ ఏర్పాట్ల పై ఉంచితే ప్రమాదాలు జరగవని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### అడుగడుగునా పోలీస్ బందోబస్త్ ... డ్రోన్, సిసి కెమెరాలతో నిఘా

గాంధారి మైసమ్మ బోనాల జాతర నేపథ్యం లో బెల్లంపల్లి ఏ.సి.పి కిరణ్ కుమార్ పర్యవేక్షణలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్స రమేష్ నేతృత్వంలో సుమారు 300 మంది పోలీసులతో అడుగడుగునా బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వెళ్లే దారిలో మంచిర్యాలమహా రాష్ట్ర జాతీయ రహదారి ఉండడంతో పోలీసులు భక్తులు అటు ఇటు వెళ్లి వచ్చేందుకు ట్రాఫిక్ ను కంట్రోల్ చేశారు. సివిల్ విభాగం పోలీసులతో పాటు, టాస్క్ ఫోర్స్, ఇంటిలెజెన్స్, స్పెషల్ బ్రాంచ్, ప్రత్యేక బలగాల పోలీసులు రంగంలోకి దిగారు. డ్రోన్, సీసీ కెమెరాలతో ఆలయ పరిసరాలను, క్యూ లైన్‌లను, ట్రాఫిక్, జన సమూహాలను పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రదేశానికి పోలీస్‌లను పంపుతూ భక్తులకు పోలీస్ సేవలు అందించారు.

## జల్ జంగల్ జమీన్ నినాదంతో ప్రపంచ ఆదివాసి దినోత్సవ సంబరాలు

**లింగాపూర్, ఆగస్టు 9, ప్రభాతవార్త**

ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా, లింగాపూర్ మండలంలోని గ్రామలలో గ్రామస్తులు ఘనంగా ఆదివాసి జెండాను ఎగరవేశారు. జల్, జంగల్, జమీన్ అనే నినాదాన్ని సజీవంగా నిలబెట్టుకుంటూ, చట్టబద్ధమైన హక్కుల సాధన కోసం ఐక్యంగ ఉండి కొమురం భీమ్, రాంజీ గోండ్, భీర్ షా ముండా, సమ్మక్క సారక్క, రాణి రుద్రమదేవి వంటి మహనీయుల వారసత్వాన్ని కొనసాగించాలని సంకల్పించారు. ఆదివాసి సంస్కృుతి, సంప్రదాయాలు, భాషను కాపాడుతూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుపై ఎక్కువ దృష్టి పెట్టి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు, విద్య ద్వారానే సమాజాభివృద్ధి న్యాయమైన చట్టబద్ధ హక్కుల సాధనకు సులువు అవుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పటేల్ మేస్రం గంగు, ఆదివాసి సంఘ నాయకులు మడావి శెకు, మెస్రం బాధి పటేల్, కనక మారుతి, మడవి సోనుకుమార్ జుగ్నక యశ్వంత్ ,మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

**బెజ్జూర్, ఆగస్టు 9, ప్రభాతవార్త**



బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదివాసి గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బాజా భజంత్రీలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతేకాకుండా ప్రధాన రహదారిపై ఆదివాసి సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సర్పంచులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా సర్పంచుల సంఘం జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన కోనేరు భూమన్నకు సన్మానం

**సారంగాపూర్, ప్రభాతవార్త:**



సారంగాపూర్ సర్పంచ్, మండల గౌరవాధ్యక్షుడు కోనేరు భూమన్న జిల్లా సర్పంచుల సంఘం జనరల్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సత్యాజి, జిల్లా లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నయ్య ఆదివారం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కురుమ కులానికి చెందిన యువత రాజకీయాల్లోకి ముందుకు రావాలని, సంఘం అభివృద్ధి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్, రాము, మల్లేష్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటిన కౌన్సిలర్ తాలోడ్ శ్రీనివాస్

**భైంసా, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



భగవాన్ శ్రీ సత్య సాయి వారి దివ్య ఆశీస్సులతో భైంసా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి ప్రేమ తరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక వాసవి మాత మందిరం, పవర్ హౌస్ సమీపంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ తాలోడ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. భైంసా సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ముందుకు సాగుతున్న సభ్యులందరికీ ఆ దేవుని కృపాకటాక్షాలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో 7, 8 వార్డుల కౌన్సిలర్లు జోందిలే రాహుల్, చర్ల సుభాష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సాయినాథ్ దోమకొండవార్, సత్యసాయి సేవా సమితి సభ్యులు కట్కం శ్రీనివాస్, సీహెచ్. శ్రీనివాసరాజు, సూరిబాబు, నరేందర్, భవాని, లక్ష్మణ్, మహిళా సభ్యులు ప్రతిభ, సీహెచ్. రోజా, జ్యోతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి నేలమట్టమైన ఇల్లు

**వేమనపల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త**

సుంపుటం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చప్పిడి వెంకయ్యకు చెందిన ఇల్లు ఆదివారం నేలమట్టమైంది. వర్షం తీవ్రతకు ఇంటి గోడలు బలహీనపడి ఒక్కసారిగా కూలిపోయాయి. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో కుటుంబం నిరాశ్రయంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వర్షాల కారణంగా ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని అధికారులు వెంటనే పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

# ఆదిలాబాద్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుగా ఎంపిక చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేశామని, ఇందుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. మంచినీటి సరఫరా, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు.

## యువత సంక్షేమానికి చర్యలు

**- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు, ఆదివాసీ ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలపడ్డాయని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో గ్రంథాలయాలు, శుద్ధ జల ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత డ్రైవింగ్ లైసెన్సులు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో ఉట్నూర్‌లో ఉపాధి మేళా నిర్వహించడంతో పాటు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.గంజాయి సాగు, విక్రయాలు చట్టరీత్యా తీవ్ర నేరమని, యువత అటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు కృషి

ఐటీడీఏ పీఓ మంద మకరందు మాట్లాడుతూ ఆదివాసీ జీవన విధానం ప్రకృతి ఆరాధన, సంప్రదాయ వైద్య పరిజ్ఞానానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ వారి సమగ్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల పరిరక్షణకు శాంతియుత, రాజ్యాంగబద్ధమైన మార్గాల్లో పోరాటం చేయాలని సూచించారు. జీవో 3, జీవో 49, పోడు భూములు, పెసా, అటవీ హక్కుల చట్టాల అమలుపై సమీక్ష అవసరమన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన యువతకు పోలీస్ ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ గతంలో అమలు చేసిన కొన్ని అటవీ చట్టాలు, టైగర్ రిజర్వ్ ఆంక్షల కారణంగా గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎస్పీ రిత్విక్, వివిధ శాఖల అధికారులు, ఆదివాసీ ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, మహిళలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.



# ఆదివాసీ వేడుకల్లో మెరిసిన ఐఏఎస్, ఐపీఎస్

## సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపంగా కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా, వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా ఉన్నతాధికారులైన జిల్లా కలెక్టర్ కె. హరిత , జిల్లా ఎస్పీ నీతిక పంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పండుగ వాతావరణాన్ని మరింత ద్విగుణీకృతం చేస్తూ.. వారిద్దరూ స్వయంగా ఆదివాసీ ఆడపడుచుల సాంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి వేడుకలకు హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. కార్యక్రమానికి విచ్చేసిన అధికారులకు గిరిజన పెద్దలు, మహిళలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనల్లో కలెక్టర్, ఎస్పీ ఇద్దరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరిజన కళాకారులతో కలిసి అడుగులు వేస్తూ, రేలా పాటలకు డ్యాన్స్ చేసి ఆదివాసీ సోదరసోదరీమణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.







# ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల దృశ్యమాలిక..

























